సాక్షి
నల్లగొండ
బుధవారం । 11 । జూన్ । 2025



నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్
ఇంజన్‌లో సాంకేతిక లోపంతో జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. - 8లో



బాలుడి కిడ్నాప్
నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం బాలుడు(20 నెలలు) కిడ్నాప్‌కు గురయ్యాడు. - 8లో



నకిలీ విత్తన ముఠా అరెస్టు
నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ నర్సింహ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

చందంపేట ఎంఈఓ సస్పెన్షన్

చందంపేట : చందంపేట ఎంఈఓ చందర్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. చందంపేట మండలంలోని కొర్రతండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న పర్వీన్ సుల్తానా అక్కడ విద్యార్థులు లేకపోవడంతో ఆమెను గాగిళ్లాపురం యూపీఎస్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అయితే ఏడాది కాలంగా సదరు ఉపాధ్యాయురాలు పాఠశాల విధులకు హాజరుకాలేదు. అందుకు అప్పటి ఇన్‌చార్జి ఎంఈఓ సామ్యానాయక్ సహకారం అందించినట్లు తేలడంతో ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యానాయక్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఇందుకు సహకారం అందించిన గాగిళ్లాపురం యూపీఎస్ హెచ్‌ఎం వేణుమాదవ్ సైతం గతంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజాగా ఇదే వ్యవహారంలో చందంపేట ఎంఈఓ చందర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు రకాల ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేస్తాం


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ : జిల్లాలో మూడు రకాల స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని సెర్ప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిశోర బాలికలు, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా 36 పరస్పర సహకార సంఘాలు ఏర్పాటు చేశామని, వారికి జిల్లాలో మూడు బృందాలు శిక్షణ ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది బ్యాంక్ లింకేజీ రుణాలు సుమారు రూ.1090 కోట్లు, డీఆర్డీఓ నుంచి రూ.144కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ.1200 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చామని వాటిలో 68 శాతం వసూలు చేశామని, 32 శాతం వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాత రుణాలు చెల్లిస్తే కొత్త రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏపీఎంలు కృష్ణమూర్తి, రూపీస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు డీఈవో భిక్షపతి తెలిపారు. మంగళవారం సామాన్య శాస్త్రం పేపర్–2 పరీక్షకు 268 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

రైతులను బలోపేతం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్


శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : రైతు సంక్షేమంతో పాటూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటకు ఆయన సాగునీటిని విడుదల చేశారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోనే వానాకాలం పంటకు సాగునీటి విడుదల చేయడంలో శాలిగౌరారం ప్రాజెక్టు మొదటిదిగా నిలిచిందని, మొదటగా నీటి విడుదల చేపట్టే అవకాశం దక్కడం తనకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రాజెక్టు ద్వారా మండలంలోని తొమ్మిది గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాలకు సాగునీరందడం గొప్ప విషయమన్నారు. రైతులు సాగునీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకొని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందేలా సహకరించాలని సూచించారు. శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈఈ సత్యనారాయణ, ఏఈ అమర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ, డైరెక్టర్లు పదాల రమేశ్, గైగుళ్ల అవిలయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కార్యదర్శి గూని వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చామల వెంకటరమణారెడ్డి, అల్లి సైదులు, భూపతి అంజయ్య, కర్నాటి కృష్ణ, కడారి అంజయ్య, పుల్లూరి దేవేందర్, జమ్ము అశోక్, శ్రీనివాసులు, రామచంద్రయ్య వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని గొల్లగూడలో 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ఐదేళ్లలోపు పిల్లలందరినీ దగ్గర్లోని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ–3వ అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్న పిల్లలు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ, పిల్లలకు పాఠశాల పూర్వ ప్రాథమిక విద్య అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ పీఠమే కావాలి!

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి అడిగిన నలుగురు నేతలు
- వారిలో ముగ్గురికి పీసీసీ పదవులు
- అసంతృప్తిలో ఇద్దరు నేతలు
- రాష్ట్రస్థాయి పదవి అక్కర్లేదని టీపీసీసీ అధ్యక్షుడికి మోహన్‌రెడ్డి లేఖ!



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి ఆశించిన నేతలకు చుక్కెదురైంది. ఈ పదవి ఆశిస్తున్న వారికి తాజాగా పీసీసీ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులు వచ్చాయి. దీంతో వారు డీసీసీ అధ్యక్ష పదవికి దూరం కావాల్సి వచ్చింది. డీసీసీ అధ్యక్ష పదవిని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్ నేత, చనగాని దయాకర్ ఎప్పటినుంచో ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఊహించని విధంగా సోమవారం అధిష్టానం మోహన్‌రెడ్డి, మల్లయ్యను పీసీసీ ఉపాధ్యక్షులుగా, దయాకర్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. తాను అడిగిన పదవి ఇవ్వకుండా, అడగని ఉపాధ్యక్ష పదవి ఎందుకు ఇచ్చారని గుమ్మల మోహన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాకు సంబంధంలేని ఆ పదవి తనకు అక్కర్లేదని మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు లేఖ రాసినట్లు తెలిసింది.

నెరవేరని మంత్రి హామీ..
కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి.. మంత్రి కోమటిరెడ్డికి ప్రధాన అనుచరుడు. మొదటి నుంచి మంత్రిని అంటిపెట్టుకుని ఉంటున్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా నల్లగొండ నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయానికి కృషి చేశారు. ఆ సందర్భంలోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయనకు కార్పొరేషన్ పదవి ఇప్పిస్తానని హామీ కూడా ఇచ్చారు. ఒక దశలో ఎమ్మెల్సీ ఇస్తారన్న చర్చ కూడా సాగింది. సామాజిక సమీకరణలో భాగంగా ఆయనకు ఆ పదవి దక్కలేదు. ఆ తర్వాత పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తారన్న ప్రచారం సాగింది. కానీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి రావడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారు. తనకు ఆ పదవి అక్కర్లేదని కార్పొరేషన్ లేదంటే డీసీసీ అధ్యక్ష పదవి కావాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన మోహన్‌రెడ్డికే ఇచ్చిన హామీ మేరకు పదవి ఇవ్వలేకపోతే, పార్టీలో ఇక తమ పరిస్థితి ఏంటని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పదవి వచ్చినా నిరాశలోనే..
తాను ఏదైనా కార్పొరేషన్ లేదంటే పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తుంటే ఉపాధ్యక్ష పదవి తమకు ఎందుకని గుమ్మల మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది. తనకు రాష్ట్రస్థాయి పదవి అవసరం లేదని, జిల్లా అధ్యక్ష పదవి, లేదంటే కార్పొరేషన్ ఇస్తే తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది. లేదంటే తాను పార్టీలో ఇప్పటిలాగే సామాన్య కార్యకర్తగా పని చేస్తానని వెల్లడించారు.

సామూహిక సెలవులోకి పంచాయతీ కార్యదర్శులు?

- డీఎస్‌ఆర్ యాప్‌ను తొలగించాలని డిమాండ్
- పంచాయతీలకు నిధుల్లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నల్లగొండ : పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే మంత్రులకు, ప్రిన్సిపల్ సెక్రటరీకి వారు వినతులు సమర్పించినా పరిష్కారానికి నోచుకోలేదు. పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో.. నిధుల రాక ఆర్థికంగా వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం (డెయిలీ శానిటేషన్ రిపోర్ట్) డీఎస్‌ఆర్ యాప్‌ను తీసుకొచ్చి రోజూ గ్రామాల్లో నిర్వహించిన పనులను అప్‌లోడ్ చేయాలంటూ నిబంధనలు విధించడంపై కార్యదర్శులు మండిపడుతున్నారు. 20 రోజులుగా డీఎస్ఆర్ విధులకు దూరంగా ఉంటున్నా.. దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల జేఏసీ ఆధ్వర్యంలో సామూహిక సెలవులోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే మంగళవారం నల్లగొండలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు.

డీఎస్‌ఆర్ యాప్‌తో వ్యక్తిగత డేటాకు నష్టమని..
ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన డీఎస్ఆర్ యాప్ వల్ల తమ పర్సనల్ డేటాకు భంగం వాటిల్లుతుందని కార్యదర్శులు పేర్కొంటున్నారు. తమ సొంత ఫోన్‌లో ఈ యాప్ డౌన్ లోడ్ చేసుకోవడం వల్ల డేటా చౌర్యానికి గురవుతుందని దీంతో మహిళా కార్యదర్శులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే కార్యదర్శులు 45 రకాల పనులు చేయాల్సి ఉంటుంది. ఈ డీఎస్ఆర్ యాప్ వల్ల మిగతా పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఎదురవుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికే సెల్ ఫోన్లలో ఇందిరమ్మ ఇళ్లు, ఎస్‌బీఎం, మిషన్ భగీరథ, ఆవాస్, ఎఫ్ఎస్‌సీ, ఎల్ఆర్ఎస్, ఈ–పంచాయతీ, మేరి పంచాయత్, పీఎస్ యాప్, ఎస్‌బీఎం ప్లస్, జూమ్, గూగుల్ మీట్ తదితర యాప్‌లు తమ డౌన్‌లోడ్ చేసుకున్నామని ఇప్పుడు డీఎస్ఆర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేమని అంటున్నారు.

ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి



పంచాయతీల్లో ఉన్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని జేఏసీ పిలుపు మేరకు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాం. డీఎస్ఆర్ యాప్‌ను ఉపసంహరించుకోవాలని కోరాం. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలి. లేదంటే జేఏసీ తీసుకునే నిర్ణయం మేరకే పంచాయతీ కార్యదర్శులు అంతా నడుచుకుంటాం.
– ఖాసీం, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

పంచాయతీలకు ఆగిన నిధులు..
పంచాయతీ పాలకవర్గాల గడువు తీరి 18 నెలలు అవుతోంది. అప్పటి నుంచి 1, 2 నెలలు మినహా పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాక్టర్, డీజిల్, ఇతర మెయిన్‌టెనెన్స్‌తో పాటు అత్యవసర పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇందుకోసం అప్పులు చేయాల్సి వస్తోందని.. నిధులు ఇవ్వాలని కార్యదర్శులు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోయింది.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ : భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని ఖుదాభక్షపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు ఇవ్వలేని వారు ఈనెల 20 వరకు తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అనంతరం మర్రిగూడ సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, ఇన్ పేషెంట్ రిజిస్టర్లను, మందుల స్టాక్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శంకర్ నాయక్, వైద్యులు అరుణతార, మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాజీ ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ విఠల్‌రెడ్డి, ఆర్ఐ జహీర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలి
నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ ఉదయాదిత్య భవన్‌లో విద్యాశాఖ అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యలో బడి మానేసే వారి శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వారీగా గతేడాది.. ఈ సంవత్సరం విద్యార్థుల నమోదుపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భవిత కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో రెండు రోజుల పాటు పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఈఓ భిక్షపతి, దేవరకొండ ఆర్‌డీఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిలా క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీంపేటలోని క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో విద్యార్థులు తమ పేర్లను tgss.telangana.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్యలో జన్మించి ఉండాలని, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 8, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, జనన, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బాల, బాలికలకు మండల స్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని.. జిల్లా స్థాయి పోటీలు మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 24న బాలలికలకు, 25న బాలురకు ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440072854 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నల్లగొండ రింగ్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సెక్రటేరియట్‌లో సమీక్ష

నల్లగొండ : నల్లగొండ రింగ్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్లగొండ రింగ్ రోడ్డుపై హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చిన రైతులు, ప్లాట్ ఓనర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. వారి ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. కలెక్టర్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నల్లగొండ అర్బన్, మామిళ్లగూడెం ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేశామని అధికారులు వివరించారు. భూమి కోల్పోయిన వారి ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్‌ను మంత్రి ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, పీఎస్ చంద్రమోహన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ధర్మారెడ్డి, డీఈ మురళి, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తవ్వాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

చండూరు : భవిత కేంద్రం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తవ్వాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం చండూరు హైస్కూల్‌లో మరమ్మతులు చేస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను నిరంతరం పర్యవేక్షించి పూర్తయ్యేలా చూడాలని ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట చండూరు మున్సిపల్ కమిషనర్ పుష్పలత తదితరులు ఉన్నారు.

బడి ఇలా.. చదువెలా!

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడికక్కడే నిలిచిన అభివృద్ధి పనులు

- నిధుల లేమితో చాలా చోట్ల పనులను మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు
- 'సాక్షి' పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు
- రేపటి నుంచి స్కూళ్లు పునః ప్రారంభం

'మన ఊరు - మన బడి' కార్యక్రమంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధికి పూనుకుంది. కానీ నిధుల లేమి కారణంగా పనులు పూర్తికాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తరగతి గదులు నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. అవికూడా ఎక్కడివక్కడే ఉన్నాయి. రేపటి నుంచి (గురువారం) పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం 'సాక్షి' ఆయా పాఠశాలలను సందర్శించి పనులపై ఆరా తీసింది. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు విద్యార్థులకు స్వాగతం పలకున్నాయి.

బేస్మెంట్ స్థాయిలోనే పనులు


గట్టుప్పల్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో పిల్లర్ల స్థాయిలోనే ఉన్న నిర్మాణం

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం 'మన ఊరి మనబడి' కార్యక్రమంలో భాగంగా ఐదు తరగతి గదుల నిర్మాణానికి రూ.68 లక్షలు మంజూరు చేసింది. ఆ పనులు ఇప్పటి వరకు బేస్మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. బిల్లు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో విద్యార్థులకు గదుల కొరత తప్పడం లేదు. ఉన్న గదుల్లోనే ఇరుకుగా కూర్చుంటూ చదువుకోవాల్సి వస్తోంది.

నాలుగు భవనాలూ అసంపూర్తిగానే..


కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో రంగులు వేయని పాఠశాల భవనం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలో 'మన ఊరు మన బడి' పథకం కింద పది పాఠశాలల అభివృద్ధి, నూతన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించింది. అందులో భాగంగా కొండమల్లేపల్లి, పెండ్లిపాకల, గుమ్మడవెల్లి, కొత్తబావి పాఠశాలల్లో నూతన భవన నిర్మాణం చేపట్టారు. అవి 80 శాతం వరకు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఈ భవనాలు అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు.

మధ్యలోనే నిచిలిపోయిన నిర్మాణం


గాంధీనగర్ హరిజనవాడలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల నిర్మాణం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీతో పాటు మండలంలో మొత్తం 88 పాఠశాలలు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 31 పాఠశాలలను గుర్తించి రూ.18.22 కోట్లతో అభివృద్ధికి పూనుకుంది. ఈ పథకం కింద కేవలం నాలుగు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల మధ్యలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్నింటిని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసింది. కానీ పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మూత్రశాలలు కూడా లేకపోవడంతో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల ఉన్నా.. నీటి సరఫరా సరిగా లేదు. చాలా వరకు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తిచేస్తే తరగతి గదుల కొరత తీరుతుంది.

ఈ ఏడాది కూడా శిథిల భవనంలోనే పాఠాలు


డిండిలోని శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల


డిండిలో నిర్మాణ దశలోనే ఆగిపోయిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులు

డిండి : డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థ చేరడంతో నూతన తరగతి గదుల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు మనబడి' కింద రూ.కోటి 80 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు రూ.70 లక్షలు ఖర్చు చేసి తరగతి గదులను స్లాబ్ లేవల్ వరకు నిర్మించాడు. కానీ కాంట్రాక్టర్‌కు రూ.16 లక్షలు మాత్రమే నిధులు డ్రా కావడంతో నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు. రేపటి నుంచి పాఠశాల పునః ప్రారంభం అవుతున్నా.. తరగతి గదుల నిర్మాణం పూర్తి కాక పోవడంతో ఈ ఏడాది కూడా శిథిలావస్థ దశకు చేరిన భవనంలోనే చదువుకోవాల్సి వస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అర్ధశతాబ్దం దాటినా అలాగే..


శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

చండూరు : చండూరు జిల్లా పరిషత్ పాఠశాల భవనానికి అర్ధశతాబ్దం దాటినా నూతన భవన నిర్మాణానికి మోక్షం కలగలేదు. సరిపడా తరగతి గదులు లేక ఈపాత భవనాన్ని కూడా వినియోగిస్తున్నారు. ఈ భవనంలో ఒక తరగతితోపాటు పాటు, హెచ్‌ఎం, స్టాఫ్ రూమ్‌లను వినియోగిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే.. ఈ భవనం కురుస్తుంది. ఇప్పటికే గదుల కొరత ఉన్నా ఊరికి దూరంగా ఉన్న ప్రాథమిక పాఠశాలను ఇక్కడికే మార్చారు. ఈ సంవత్సరం భవిత కేంద్రం కోసం మరో గదిని కేటాయించాల్సి వచ్చింది. నూతన భవనం ఎప్పుడు నిర్మిస్తారోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

నకిలీ విత్తనాల ముఠా అరెస్టు

- రూ.65లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటటౌన్ : నకిలీ పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్న అరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ కె. నర్సింహ తెలిపారు. వారి నుంచి రూ.65 లక్షల విలువ గల 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసు వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ బస్ స్టేజీ వద్ద ఈ నెల 9న సీసీఎస్ పోలీసులు, ఆత్మకూర్(ఎస్) పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తండా నగేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడు 120 ప్యాకెట్ల నకిలీ విత్తనాలను గోనె సంచిలో పెట్టుకొని ని బైక్‌పై వెళ్తుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. నగేష్.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన పంది రాము వద్ద విత్తనాలు తెస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పంది రామును అతని గ్రామంలో అదుపులోకి తీసుకొని విచారించగా.. ఎన్టీఆర్ జిల్లా మైలవరం గ్రామంలో బానోతు జయరాం షాపులో కొనుగోలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అలాగే జయరాం షాపునకు గుంటూరు జిల్లా బాలాజీనగర్‌కు చెందిన తరిగొప్పుల శ్రీనివాసరావు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో జయరాంను, శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించగా.. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు అనే వ్యక్తి అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తన కంపెనీ నిర్వహిస్తూ విత్తనాలు తయారు చేస్తున్నాడు. తరిగొప్పుల శ్రీనివాసరావు మధ్యవర్తిగా ఉంటూ కర్నూలు జిల్లా పల్లిపాడు గ్రామానికి చెందిన చెవుల నర్సింహలుతో సరఫరా చేస్తున్నట్లు తేలింది. జయరాం షాపులో నిల్వచేసిన 37 బస్తాల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోగా ఈ బస్తాలో ఒక్కొక్క దానిలో 120 ప్యాకెట్లు నకిలీ విత్తనాలు ఉన్నాయి. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న విత్తనాల విలువ సుమారు రూ.63 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. ఈ కేసులో తండ నగేష్, పంది రాము, బాణోతు జయరాం, తరిగొప్పుల శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా.. ఏ–1 అయిన అరుణోదయ నకిలీ పత్తి విత్తనాల కంపెనీ ఎండీ మాగులూరి సాంబశివరావు, ఏ–6 చెవుల నర్సింహులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మరో కేసులో ఇద్దరు అరెస్టు

ముందస్తు సమాచారం మేరకు సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన వెలుగు శ్రీను అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల 9న జిల్లా సీసీఎస్, మోతె పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అతని ఇంట్లో అడ్వాన్స్ 333, అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తనాల కంపెనీల పేరుతో ఉన్న 98 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి విచారించగా.. శ్రీను బంధువైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చర్లపల్లి శాత వాహన అనే వ్యక్తితో కలిసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ రైతులకు ఈ నకిలీ విత్తనాలు అమ్ముతున్నామని ఒప్పుకున్నాడు. వెంటనే శాత వాహన అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 30 ప్యాకెట్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరికి ఈ విత్తనాలు సరఫరా చేస్తున్న మరో వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నలుగునూర్‌కు చెందిన తిరుమల్‌గా గుర్తించారు. ప్రస్తుతం తిరుమల్ పరారీలో ఉండగా అతనిని పట్టుకునేందుకు పోలీస్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో రూ.2లక్షల విలువ చేసి 58 కేజీల నకిలీ విత్తాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో బాగా పని చేసిన సిబ్బందిని అభినందించారు. విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీసీఎస్ సీఐ శివకుమార్, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, ఆత్మకూరు ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


నకిలీ విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, పోలీసు సిబ్బంది

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి కేసులో నలుగురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్

చివ్వెంల(సూర్యాపేట): వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన నలుగురిని మంగళవారం పోలీసులు రిమాండ్ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన ధరావతు అశోక్‌పై గత నెల 23వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గ్రామ శివారులోని లక్ష్మీనగర్ టౌన్‌షిప్‌లో దాడి చేశారు. దీంతో అశోక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన అల్లకుంట్ల రాము, ఓర్సు కేశవ, ఇద్దరు మైనర్లను మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

గరిడేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం: రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు మహేష్(36) గత కొన్నేళ్లుగా కీతవారిగూడెంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు ఇటీవల పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తితో మంగళవారం ఉదయం తన భార్య షాపు వద్దకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విహారయాత్రకు వద్దన్నారని..

యాదగిరిగుట్ట: విహారయాత్రకు వెళ్లేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదని మనస్తాపంతో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం జరిగింది. వివరాలు.. యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన గంగాధార్ భరత్(17) ఇంటర్ ఫస్టియర్ పూర్తిచేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విహారయాత్రకు వెళ్తానని తల్లిదండ్రులను అడిగాడు. ఇల్లు కట్టుకోవడానికే డబ్బులు లేవు.. ఇప్పుడు టూర్‌కు ఎందుకని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భరత్ ఇంటి వెనుక గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి భువనగిరి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే భరత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ భాస్కర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకిరేకల్: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని అరెంపుల గ్రామానికి చెందిన వల్లూరు భూపాల్‌రెడ్డి(52)కి నకిరేకల్ మండలం మండలాపురం గ్రామానికి చెందిన జానకితో వివాహమైంది. గతేడాది నుంచి భూపాల్‌రెడ్డి మండలాపురంలో తన అత్తగారింట్లోనే భార్యతో కలిసి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు(కవల పిల్లలు) ఉన్నారు. మద్యానికి బానిసైన భూపాల్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన తన అత్తగారి నిమ్మతోటకు వెళ్లాడు. మద్యంలో మత్తులో తోటలో గడ్డి మందు తాగాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి తాను గడ్డి మందు తాగానని కుటుంబ సభ్యులతో చెప్పాడు. అప్పటికే అపస్మారకస్థితిలోకి వెళ్లిన భూపాల్‌రెడ్డిని కుటుంబ సభ్యులు వెంటనే నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రిష్ణమాచారి తెలిపారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి


సిద్దు (ఫైల్)

డిండి: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం డిండి మండలం నగారాదుబ్బతండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగారాదుబ్బతండాకు చెందిన కరంటోతు చంద్రు, బుజ్జి దంపతుల కుమారుడు సిద్దు(13) నాగరకర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ అక్కడే ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్వగ్రామంలోనే ఉంటున్న సిద్దు సోమవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన నలుగురి స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని మెట్టన్‌కుంట వద్దకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో సిద్దు ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగిపోయాడు. అతడి స్నేహితులు నలుగురు భయంతో అక్కడి నుంచి చేరుకున్నారు. కానీ సిద్దు నీటి కుంటలో పడిపోయిన విషయం ఎవరికీ చెప్పలేదు. రాత్రయినా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో సిద్దు తల్లిదండ్రులు గ్రామంలో ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. మంగళవారం తెల్లవారుజామున సిద్దు వెంట వెళ్లిన స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న అతడి తల్లిదండ్రులు, తండావాసులు మెట్టన్‌కుంటలో వెతకగా సిద్దు మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సిద్దు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి చంద్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ఎస్‌ఎల్‌బీసీ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా నుంచి అతివేగంగా వస్తున్న కారు నల్లగొండ నుంచి ఎస్‌ఎల్‌బీసీ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడేనికి చెందిన వంశీ (22) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన బైక్ నడుపుతున్న రుద్రాక్షి తిలక్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరు పేటీఎం కంపెనీలో పనిచేస్తున్నారు. కారు బైక్‌ను ఢీకొట్టిన తర్వాత పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులు అప్రమత్తమై తప్పించుకోవడంతో వారికి ప్రాణపాయం తప్పింది. ఈ ఘటనలో కారు టైరు పేలిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఉన్న వ్యక్తులు ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య


సురేందర్ (ఫైల్)

గుర్రంపోడు: రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్న కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. తెరాటిగూడెం గ్రామానికి చెందిన నారబోయిన సురేందర్(20) రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. సోమవారం కూడా సురేందర్ మద్యం తాగి ఇంటికి రావడంతో.. ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు నారబోయిన అచ్చమ్మ, మల్లయ్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సురేందర్ ఇంట్లో నుంచి వెళ్లిపోయి తమ బత్తాయి తోట లో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల రైతులు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు కాంస్య పతకం


ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు

నల్లగొండ టూటౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు కాంస్య పతకం గెలుచుకుంది. మంగళవారం ఉమ్మడి జిల్లా జట్టుకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంస్య పతకం, ట్రోఫీ అందజేశారు. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమాం కరీం క్రీడాకారులకు అభినందించారు.

ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

బీబీనగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని అంకుశాపూర్ పరిధిలో గల ప్రిన్స్‌టన్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 సంవత్సరానికి గాను అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పాసైన మహిళా అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు 2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలని సూచించారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్‌సీ, బీజెడ్‌సీ, బీకాం, సీఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995010687, 7981199283 నంబర్లను సంప్రదించాల ప్రిన్సిపాల్ సూచించారు.

రేపు పోచంపల్లికి గవర్నర్ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు


టూరిజం పార్కులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లికి గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేనేత జౌళిశాఖ రాష్ట్ర అధికారులతో కలిసి స్థానిక టూరిజం పార్కుతో పాటు సమీపంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శించారు. టూరిజం పార్కులో చేనేత వస్త్రాల తయారీ విధానాలను గవర్నర్ పరిశీలించనున్న నేపథ్యంలో పార్కులో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా టూరిజం పార్కులోని కాన్ఫరెన్స్ హాల్‌లో చేనేత కార్మికులు, కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో గవర్నర్ ముఖాముఖి నిర్వహించనుండడంతో అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. చేనేత బీమా, త్రిఫ్ట్ పథకం చెక్కులను గవర్నర్ లబ్ధిదారులకు అందజేయనున్న నేపథ్యంలో ఎంపిక చేసిన పోచంపల్లి, కుంట్లగూడేనికి చెందిన చేనేత కార్మికులకు సమాచారం ఇచ్చి వారు సకాలంలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ చేనేత కార్మికుల గృహాలను సైతం సందర్శించి మగ్గాలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొంటారని.. దీంతో టూరిజం పార్కు సమీపంలో ఉన్న చేనేత కార్మికులైన భారత భాస్కర్, భారత మధు, పొట్టబత్తిని శేఖర్ ఇళ్లను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, మున్సిపల్, చేనేత జౌళిశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లాఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, జౌళిశాఖ అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌రెడ్డి, చేనేత నాయకులు తడక రమేష్, భారత లవకుమార్, అంకం పాండు, ఏలే భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

గురువారం ఉదయం 10.45 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పోచంపల్లికి చేరుకుంటారు. 11.15 వరకు చేనేత గృహాల సందర్శన, 11.15 నుంచి 11.30 గంటలకు టూరిజం పార్కును సందర్శించి పార్కులో చేనేత వస్త్ర తయారీ ప్రక్రియను పరిశీలిస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటలకు చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశం ఉంటుంది. మధ్యాహ్నం 12.15 వరకు చేనేత కార్మికులకు బీమా, త్రిఫ్ట్ ఫండ్ చెక్కుల పంపిణీ చేస్తారు. అనంతరం 12.15 గంటల తర్వాత గవర్నర్ తిరిగి రాజ్‌భవన్‌కు పయనమవుతారు. అయితే గవర్నర్ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో బాలుడి కిడ్నాప్

- ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు


కిడ్నాప్‌కు గురైన సోమేష్‌కుమార్


సీసీ కెమెరాల్లో రికార్డయిన మహిళ

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం బాలుడు(20 నెలలు) కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన బైరం భాగ్యలక్ష్మి, అంజిబాబు దంపతులకు మొదటి కాన్పులో కుమారుడు సోమేష్ కుమార్(20 నెలలు) జన్మించాడు. భాగ్యలక్ష్మి ఈ నెల 8న రెండో కాన్పు కోసం కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. మంగళవారం మధ్యాహ్నం భాగ్యలక్ష్మితో పాటు ఆమె కుమారుడు సోమేష్‌కుమార్, బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట గల చెట్టు కింద సేదతీరారు. అప్పటికే ఇద్దరు మహిళలు భాగ్యలక్ష్మితో పాటు ఆమె బంధువులతో పరిచయం పెంచుకున్నారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత భాగ్యలక్ష్మి తన కుమారుడు సోమేష్‌కుమార్‌ను తనకు పరిచయమైన ఇద్దరు మహిళల వద్ద ఉంచి కాన్పుల వార్డుకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి కుమారుడు, ఇద్దరు మహిళలు కనిపించలేదు. దీంతో భాగ్యలక్ష్మి, ఆమె బంధువులు ఆస్పత్రి మొత్తం వెతికినా సోమేష్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. భాగ్యలక్ష్మికి ఇంకా రెండో కాన్పు కాలేదు.

నాలుగు బృందాలతో గాలింపు..

నల్లగొండ: బాలుడి ఆచూకీ కనిపెట్టేందుకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలతో నాలుగు టీంలను ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. అంతేకాకుండా డీఎస్పీ తన సిబ్బందితో ప్రభుత్వాస్పత్రికి వెళ్లి సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించారు. జిల్లా వ్యాప్తంగా బస్సులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు.

భువనగిరిలో కనిపించిన కిడ్నాపర్లు

భువనగిరిటౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కిడ్నాప్ అయిన బాలుడితో పాటు ఇద్దరు మహిళలు భువనగిరి బస్టాండ్ ఆవరణలో సంచరించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. వారు బస్టాండ్ నుంచి బయటకు వచ్చి యాదగిరిగుట్ట వైపు వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళలు భువనగిరి బస్టాండ్‌లో కొన్ని వస్తువులు కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఫోన్ పే నంబర్ ఆధారంగా కిడ్నాప్ అయిన బాలుడితో సహా ఆ ఇద్దరు మహిళలను భువనగిరి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళలిద్దరు యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూర్, ఆత్మకూర్ మండలాలకు చెందిన వారిగా సమాచారం. అయితే కిడ్నాపర్ల కోసం గాలిస్తున్నామనే భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

- లైన్ సిగ్నల్ లేక ఫలక్‌నూమా..
- నల్లగొండ రైల్వే స్టేషన్‌లో గంటకు పైగా నిలిచిన రెండు రైళ్లు


నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

రామగిరి(నల్లగొండ): సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌లో మంగళవారం సాంకేతిక లోపం ఏర్పడింది. నల్లగొండ రైల్వే స్టేషన్‌కు రైలు ఉదయం 9.10 గంటలకు వచ్చింది. అదే సమయంలో ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తి అక్కడే ఆగిపోయింది. అప్పటికే ప్లాట్‌ఫాం మీదకు వచ్చిన హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నూమా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు నిలిపివేశారు. సిబ్బంది మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. రెండు రైళ్లు సుమారు గంటకు పైగా నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రైలు ఇంజన్‌ను తెప్పించి జన్మభూమి రైలును పంపించారు. ఆ వెంటనే ఫలక్‌నూమా రైలు కూడా వెళ్లింది. 10.20 గంటలకు రెండు రైళ్లు కదిలాయి. సుమారు గంటకు పైగా ప్రయాణికులు అనేక అవస్థలు పడ్డారు.

నేడే ఏరువాక పౌర్ణమి

- వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు





హాలియా, రామన్నపేట: తొలకరి జల్లులు.. రైతన్నల మోములో చిరునవ్వు.. పుడమి తల్లి పులకరింతకు సాక్ష్యమే ఏరవాక పౌర్ణమి. ప్రతి ఏడాది వైశాఖ మాసం ముగిసి జ్యేష్ఠ మాసం మొదలైన తర్వాత వర్షాలు కురవడం మొదలవుతాయి. జ్యేష్ఠ పౌర్ణమి నాటికి తొలకరి వర్షాలు పడి భూమి మెత్తబడుతుంది. దీంతో రైతులు దుక్కులు దున్నడం, వ్యవసాయ పనులను ఏరువాకతోనే మొదలుపెడతారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏరువాక అంటే..

ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు జరుపుకునే వేడుకనే ఏరువాక అంటారు. ఏరు అంటే ఎద్దులను నాగలికి కట్టి దున్నడానికి సిద్ధం చేయడం అని అర్థం. ఈ రోజు రైతులు కాడెద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు పూసి, మెడలో గజ్జెలు, గంటలతో అలంకరిస్తారు. ఎడ్లకు కట్టే కాడిని పూజించి, ఎద్దులకు భక్షాలు తినిపిస్తారు. పొలాలకు వెళ్లి భూతల్లికి పూజలు చేసి దుక్కి దున్నడం ప్రారంభిస్తారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య వ్యవసాయ పనులు మొదలు పెడతారు.

ఏరువాక పౌర్ణమి నేపథ్యం..

ఏరువాకను జ్యోతిష్య శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభం అని వ్యవహరిస్తారు. భారతదేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఏరువాక పౌర్ణమి జరుపుకుంటారు. జ్యేష్ఠ మాసంలో ప్రారంభమయ్యే నైరుతి రుతుపవనాల ప్రభావం అంతటా ఒకేలా ఉంటుంది. 80శాతం వర్షం నైరుతి రుతుపవనాల వల్లనే కలుగుతుంది. దీంతో పొలం పనులకు ఆటంకం కలగవద్దని, పంటలు సమృద్ధిగా పండాలని రైతులు ఏరువాకను మహా యజ్ఞంగా పరిగణించి ఆచరిస్తారు. రామాయణంలో నాగేటి సాళ్లల్లో సీతమ్మ అమ్మవారు దొరికింది కాబట్టి సీతా యజ్ఞంగా కూడా భావిస్తారు. ఇదే రోజున ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి స్నానోత్సవం కూడా నిర్వహిస్తారు. అదేవిధంగా పూర్వం శ్రీకృష్ణదేవరాయల వారు తన పాలనా కాలంలో ఏరువాక పండుగ రోజున రైతుల శ్రమ, కృషిని గుర్తించి తగిన రీతిలో రైతులను ప్రోత్సహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా ఇదే రోజున శుద్దోదన రాజు కపిలవస్తులో లాంఛనంగా ఏరువాకను ప్రారంభించి బంగారు నాగలిని రైతులను బహూకరించినట్లు పురాణ కథలు చెబుతున్నాయి.

వ్యవసాయం బాగా అభివృద్ధి చెందింది



ఆధునిక పరిజ్ఞానం పెరగడం, యంత్రాలను విరివిగా ఉపయోగించడం, ప్రభుత్వం వివిధ రూపాల్లో తగిన ప్రోత్సాహం అందించడం వల్ల కొంతకాలంగా వ్యవసాయరంగం బాగా అభివృద్ధి చెందింది. పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో రైతులకు చాలా మేలు జరుగుతుంది. వివిధ రంగాల్లో స్థిరపడిన వారి దృష్టి సైతం వ్యవసాయం వైపు మళ్లింది.

– కూనూరు రమేష్ రైతు సిరిపురం, రామన్నపేట

ఏరువాకతో దున్నడం ప్రారంభిస్తాం



ఏరువాక పౌర్ణమి రోజు మా ఊర్లో రైతులందరం కలిసి వ్యవసాయ పనిముట్లు, భూదేవికి, ఎద్దులకు పూజలు చేస్తాం. అనంతరం నాగళ్లు కట్టి దుక్కులు దున్నడం ప్రారంభిస్తాం. వర్షాలు అనుకున్నట్లు పడితే ఈ ఏడాది వ్యవసాయ సాగుకు ఎలాంటి ఢోకా ఉండదు.

– అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, త్రిపురారం

ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం



2025–26 వ్యవసాయ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు డీలర్ల వద్ద, పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉన్నాయి. మెట్ట పంటలు సాగు చేసే రైతులు 60 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిన తర్వాతే పత్తి, కంది సాగు చేయాలి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి మంచి దిగుబడులు వచ్చి రైతులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

– డి. గోపాల్, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయాధికారి